క్లుప్తంగా

సందర్శన



రికార్డులు పరిశీలిస్తున్న సమగ్రశిక్ష అసిస్టెంట్ జీసీడీఓ రోజారమణి

మక్కువ: మండలంలోని ములక్యాయవలస గ్రామ సమీపంలోని మోడల్ పాఠశాలను సమగ్రశిక్ష అసిస్టెంట్ జీసీడీఓ కె.రోజారమణి సోమవారం సందర్శించారు. పాఠశాలకు చెందిన రికార్డులు, హాజరు పట్టికలను పరిశీలించారు. అనంతరం జగనన్న గోరుముద్ద మధ్యాహ్నభోజన వంటకాలను రుచి చేశారు. అలాగే తరగతిగదులు, వసతిగృహం పరిసరాలు, మెనూ పరిశీలించారు. కార్యక్రమంలో మోడల్ పాఠశాల ప్రిన్సిపాల్ స్వర్ణలత, ఉపాధ్యాయులు, తదితరులు పాల్గొన్నారు.

ఉపకరణాల ఎంపిక శిబిరం విజయవంతం



శిబిరంలో వివరాలు నమోదు చేసుకుంటున్న వైద్యులు

సాలూరు: పట్టణంలోని భవిత కేంద్రంలో సోమవారం నిర్వహించిన ఉపకరణాల ఎంపిక శిబిరం విజయవంతమైంది. ఈ శిబిరానికి సాలూరు, పాచిపెంట, మక్కువ మండలాలకు చెందిన 40 మంది ప్రత్యేక అవసరాల చిన్నారులు హాజరయ్యారు. చిన్నారులకు అవసరమయ్యే ఉపకరణాల కోసం వైద్యులు కొలతలు తీసుకున్నారు. కార్యక్రమంలో జిల్లా సృశిత విద్యా కో ఆర్డినేటర్ భానుమూర్తి, డాక్టర్లు మహేశ్వరరావు, కోటేశ్వరరావు, సురేష్, తదితరులు పాల్గొన్నారు.

రహదారులపై నూర్పులు



బలిజిపేట-పెదపెంకి రోడ్డుపై నూర్చుతున్న మినుము పంట

బలిజిపేట: బలిజిపేట నుంచి ఇతర ప్రాంతాలకు వెళ్లే ప్రధాన రహదారులు నూర్పు కళ్లాలుగా మారిపోతున్నాయి. అధికారులు స్పందించక పోవడంతో వాహన చోదకులకు ఇబ్బందికరంగా మారుతోంది. బలిజిపేట నుంచి పెదపెంకి, పదమాయవలస, వంతరాం, బొబ్బిలి వెళ్లే రోడ్లపై రైతులు రోడ్డు కనబడకుండా అపరాల పంట చేను పరిచేయడంతో వాహనచోదకులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. అపరాలను గాలికిపట్టేటప్పుడు వచ్చే దూళి ఎదురుగా వస్తున్న వారిపై పడుతుండడంతో కళ్లకు ప్రమాదకరంగా మారుతోందని వాపోతున్నారు. అటువంటి సమయంలో వాహనాలపై నుంచి బోల్తా పడుతున్నమని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. దీనిని పోలీస్‌శాఖ అధికారులు నియంత్రించి ప్రమాదాలు సంభవించకుండా చూడాలని కోరుతున్నారు.

అడ్వెంచర్ పార్క్‌లో బొమ్మ ట్రైన్ ఏర్పాటు



పార్కులో ఏర్పాటు చేసిన టాయ్‌ట్రైన్

సీతంపేట: స్థానిక అడ్వెంచర్ పార్కులో చిన్నారులు ఆడుకునేందుకు వీలుగా ఏర్పాటు చేసిన మినీ టాయ్‌ట్రైన్‌ను ఐటీడీఏ పీఓ బి.నవ్య సోమవారం ప్రారంభించారు. పర్యాటకులను ఆకట్టుకునేందుకు వీలుగా పార్కును అభివృద్ధి చేస్తున్నట్లు చెప్పారు. అందులో భాగంగా రూ.3 లక్షలతో దీన్ని ఏర్పాటు చేసినట్లు తెలిపారు.

ముగిసిన మందిర ప్రారంభోత్సవం



పూజలు చేస్తున్న భక్తులు

భామిని: మండలంలోని పసుకుడిలో చేపట్టిన శ్రీకృష్ణ, చైతన్య మహాప్రభు మందిర ప్రతిష్ఠోత్సవాలు సోమవారంతో ముగిశాయి. పాలసొసైటీ చైర్మన్ బి.ఆనందరావు దంపతులు ఆలయ ప్రతిష్ఠ, హోమం, పూర్ణాహుతి, తదితర పూజా కార్యక్రమాలు చేపట్టారు. ఈ సందర్భంగా ఒడిశాకు చెందిన ఓమణిగ హరేరామ సంకీర్తన బృందంతో చేపట్టిన తిరువీధి ఉత్సవం ఆకట్టుకుంది. మందిరం నిర్మాత, గ్రామ సర్పంచ్ బెవర భార్గవనాయుడును ఉప సర్పంచ్ దీనబంధు గోజో, సంకీర్తన బృందం సభ్యులు ఘనంగా సన్మానించారు. అనంతరం సామూహిక అన్నసంతర్పణ కార్యక్రమం నిర్వహించారు.

జగనన్నను మరోసారి గెలిపించుకుందాం..

● ఉప ముఖ్యమంత్రి పీడిక రాజన్నదొర



సమావేశానికి హాజరైన గృహసారథులు, సచివాలయ కన్వీనర్లు, తదితరులు



మాట్లాడుతున్న ఉప ముఖ్యమంత్రి, గిరిజన సంక్షేమ శాఖా మంత్రి పీడిక రాజన్నదొర

సాలూరు: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అందిస్తున్న ప్రజా సంక్షేమం, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు వివరించి, రానున్న ఎన్నికల్లో మరోసారి గెలిపించుకుందామని ఉప ముఖ్యమంత్రి, గిరిజన సంక్షేమ శాఖా మంత్రి పీడిక రాజన్నదొర పిలుపునిచ్చారు. పాచిపెంట మండలాధ్యక్షుడు గొట్టాపు ముత్యాలునాయుడు ఆధ్వర్యంలో 'మా నమ్మకం నువ్వే జగనన్న' కార్యక్రమంలో భాగంగా పట్టణంలోని మెంటాడవీధి కోదండరామ కల్యాణ మంటపంలో పాచిపెంట మండల జగనన్న సచివాలయ సమన్వయకర్తలు, గృహసారథులకు సోమవారం శిక్షణ సమావేశం నిర్వహించారు. ముందుగా నూతనంగా నియమితులైన కన్వీనర్లు, గృహసారథులకు అభినందనలు తెలియజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, సచివాలయ మండల కన్వీనర్‌గా తట్టికాయల గౌరీశ్వరరావును నియమించినట్లు చెప్పారు. రాష్ట్రం ఆర్థికలోటులో ఉన్నప్పటికీ ఇచ్చిన ప్రతి హామీని అమలుచేస్తూ ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డి ప్రజలకు అండగా ఉంటున్నారన్నారు. ప్రజా సంక్షేమం, అభివృద్ధే ధ్యేయంగా సుపరిపాలన అందిస్తున్న ఘనత జగనన్నకే దక్కుతుందని చెప్పారు. నమ్మి ఓటేసిన ప్రజలను మోసం చేసిన చరిత్ర చంద్రబాబుది కాగా ఇచ్చిన ప్రతి హామీని అమలు చేస్తూ ప్రజలకు అండగా నిలుస్తున్న గొప్పతనం ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డిదని కొనియాడారు. ప్రజలకు సంక్షేమ పథకాలు అందించడంతో పాటు పరిపాలనపై అవగాహన కల్పిస్తూ అండగా నిలవాల్సిన బాధ్యత గృహసారథులు, కన్వీనర్లపై ఉందన్నారు. అలాగే ప్రజా సమస్యలు తెలుసుకుని వాటిని తమ దృష్టికి తీసుకురావాలని సూచించారు. ఇదేక్రమంలో ప్రభుత్వంపై ప్రతిపక్షాలు చేస్తున్న తప్పుడు ప్రచారాలు, కుట్రలను తిప్పికొట్టాలన్నారు. అనంతరం గృహసారథులకు ప్రత్యేక కిట్లు అందజేశారు. రానున్న ఎన్నికల్లో జగన్ మోహన్‌రెడ్డిని మరోసారి గెలిపించుకోవాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ కొరిపల్లి రవీంద్ర, నాయకులు పాచిపెంట వీరంనాయుడు, డోల బాబ్జి, కలువలపల్లి పెద్దిబాబు, గండిపల్లి రాము, తదితరులు ఉన్నారు.

చంద్రబాబు, లోకేష్‌లను నమ్మరు..

టీడీపీ అధినేత చంద్రబాబునాయుడు, ఆయన తనయుడు లోకేష్‌లను ప్రజలు నమ్మే పరిస్థితుల్లో లేరని ఉప ముఖ్యమంత్రి పీడిక రాజన్నదొర అన్నారు. 2014లో అధికారంలోకి వచ్చిన తర్వాత చంద్రబాబు అన్నివర్గాల ప్రజలను నిలువునా మోసం చేశారని ఆరోపించారు. చంద్రబాబు తన కుమారుడికి మంత్రి పదవి ఇచ్చాడే తప్ప ప్రజలకు ఏమీ చేయలేదని ఎద్దేవా చేశారు. యువగళమంటూ లోకేష్ పాదయాత్ర చేయడం హాస్యాస్పదంగా ఉందన్నారు. అది పాదయాత్రో..? పాడెయాత్రో.. అర్థం కావడం లేదన్నారు. నియోజకవర్గ అభివృద్ధిపై తాను ఎప్పుడైనా బహిరంగ చర్చకు సిద్ధమని, దమ్ముంటే టీడీపీ నాయకులు నా సవాల్ స్వీకరించాలన్నారు. పాచిపెంట మండలం మోసూరు రోడ్డుకు కొబ్బరికాయ కొట్టి ముఖం చాటేయడం.. సాలూరులో వంద పడకల ఆస్పత్రికి రాత్రికి రాత్రి శంకుస్థాపన చేసి మిన్నకుండిపోవడం అభివృద్ధా అంటూ ఎద్దేవా చేశారు. తోణాం, మామిడిపల్లి-శంబర, మోసూరు, మోదుగ, తదితర 11 గ్రామాల రహదారులతో పాటు మోసూరు వంతెన నిర్మాణానికి నిధులు మంజూరు చేయించానని చెప్పారు. అలాగే వంద పడకల ఆస్పత్రిని కూడా పూర్తి చేయిస్తానని తెలిపారు. మాది మాటల ప్రభుత్వం కాదని చేతల ప్రభుత్వమని స్పష్టం చేశారు.

పథకాలతో పేదలకు భరోసా



అరసాడలో లబ్ధిదారుకు బుక్‌లెట్ అందించి వివరాలు తెలుసుకుంటున్న ఎమ్మెల్యే జోగారావు

● ఎమ్మెల్యే జోగారావు

బలిజిపేట: సీఎం జగన్‌మోహన్ రెడ్డి రాష్ట్ర ప్రజలకు అందిస్తున్న సంక్షేమ పథకాలు పేదలకు భరోసా కలిప్తున్నాయని ఎమ్మెల్యే జోగారావు అన్నారు. బలిజిపేట మండలం అరసాడలో గడపగడపకూ మన ప్రభుత్వం కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలోని ప్రతి ఇంటికీ ఎమ్మెల్యే జోగారావు వెళ్లి జగన్‌మోహన్ రెడ్డి ప్రభుత్వంలో అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకం అందడంతో వారి జీవనోపాధికి భరోసా కలిగి జీవనప్రమాణాలు పెరుగుతున్నాయని తెలిపారు. ఇంటింటికీ తిరిగి వారికి అందుతున్న సంక్షేమ పథకాలను వివరించి ఇంకా మీ ఇంట్లో అర్హులు ఉండి సంక్షేమ పథకాలు రావడం లేదా అని ప్రశ్నించారు. సంక్షేమ పథకాలే కాకుండా గ్రామాభివృద్ధికి ఇంకా ఏమైనా చేయాలంటే చెప్పాలని అడుగుతుండడంతో చిన్న చిన్న సమస్యలను తెలిపితే వాటిని అక్కడికక్కడే పరిష్కరిస్తున్నారు. అన్ని వర్గాలవారికి సంక్షేమ పథకాలను అందిస్తున్న ఏకైక సీఎం జగన్‌మోహన్ రెడ్డి అని, అటువంటి నాయకుడిని మళ్లీ సీఎంగా అందరం గెలిపించుకోవాలని ఎమ్మెల్యే జోగారావు ప్రజలను కోరారు.

సీఎం జగన్‌ను మళ్లీ ముఖ్యమంత్రిని చేయాలి

అర్హతే ప్రామాణికంగా పార్టీలకు అతీతంగా ఇదే తరహాలో సంక్షేమ పథకాలు అందాలంటే మళ్లీ ఈ ప్రభుత్వాన్నే గెలిపించుకోవాలని ఎమ్మెల్యే జోగారావు పిలుపునిచ్చారు. సంక్షేమం అంటే ఇలా ఉంటుందా? అనేది ప్రజలకు పక్కాగా తెలియజేసిన సీఎం జగన్‌మోహన్ రెడ్డి మాత్రమేనన్నారు. ప్రతిపక్షాలకు చెందిన నాయకులు చెప్పే మాటలను నమ్మవద్దని హితవు పలికారు. అర్హులై ఉండి సంక్షేమ పథకాలకు దూరమైతే వారిని గుర్తించి న్యాయం చేయాలని సచివాలయ ఉద్యోగులకు సూచించారు. వలంటీర్లు ఎంతో బాధ్యతాయుతంగా విధులు నిర్వహించాలని స్పష్టం చేశారు. కార్యక్రమంలో ఎంపీడీఓ భానుమూర్తి, ఎంపీపీ జి.నాగమణి, జెడ్పీటీసీ ఎ.రవికుమార్, ఎంపీటీసీ జి.ప్రభావతి, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు పి.మురళీకృష్ణ, మండల కన్వీనర్ల అధ్యక్షుడు జి.శ్రీరాములునాయుడు, పి.రామకృష్ణ, జి.లక్ష్మణరావు, పాపినాయుడు, జి.రాజు, సర్పంచ్‌లు కె.మోహనరావు, విజయ, కె.వెంకటరమణ, జగన్, జి.శ్రీనివాసరావు పాల్గొన్నారు.

గృహ సారథులే రథసారథులు

● ఎమ్మెల్యే జోగారావు



సమావేశంలో మాట్లాడుతున్న తూర్పుకాపు కార్పొరేషన్ చైర్మన్ శ్రీకాంత్

బలిజిపేట: రానున్న ఎన్నికల సమరానికి గృహ సారథులే రథసారథులని ఎమ్మెల్యే జోగారావు అన్నారు. బలిజిపేటలోని కళింగ వైశ్య భవనం వద్ద గృహ సారథులు, సచివాలయ కన్వీనర్లు, వలంటీర్లకు మానమ్మకం నువ్వే జగన్ కార్యక్రమంపై సోమవారం దిశానిర్దేశం చేశారు. మంచి చేస్తే అధికారం ఇవ్వండనే మాటతో సీఎం జగన్‌మోహన్ రెడ్డి పిలుపునిచ్చారని అందుకు అనుగుణంగా అందరం పాటుపడాలని సూచించారు. అర్హత కలిగిన ప్రతి కుటుంబానికి ప్రభుత్వం, పార్టీ అండగా ఉంటుందనేది వారికి తెలియజేయాలని కోరారు. ప్రజల్లో అసంతృప్తి ఉంటే సర్దుబాటు చేయాల్సిన బాధ్యత వలంటీర్లు, కన్వీనర్లు, గృహసారథులపై ఉందన్నారు. ప్రతి కుటుంబాన్ని అక్కున చేర్చుకుని ఆప్యాయంగా వారి సమస్యలు తెలుసుకుని పరిష్కరించేదిశగా అడుగులు వేయాలని సూచించారు.

సీఎం ఒక రక్షకుడు నిరుపేద, బడుగు, బలహీన వర్గాలు, మహిళలకు సీఎం జగన్‌మోహన్ రెడ్డి ఒక రక్షకుడిలా ఉన్నారని తూర్పు కాపు కార్పొరేషన్ చైర్మన్ మామిడి శ్రీకాంత్ తెలిపారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న మా నమ్మకం నువ్వే జగన్ కార్యక్రమాన్ని మనమందరం క్షేత్రస్థాయిలో బలంగా అమలుచేయాలని కోరారు. ఇందుకోసం వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు బలంగా పనిచేయాలని పిలుపునిచ్చారు. మహిళలంటే సీఎం జగన్‌మోహన్ రెడ్డికి నమ్మకం, గౌరవం ఉన్నాయన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ రాఘలత, ఎంపీపీ నాగమణి, జెడ్పీటీసీ రవికుమార్, వైస్ ఎంపీపీలు వి.సాయిరాం, బి.హేమలత, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు మురళీకృష్ణ, జేసీఎస్ మండల కన్వీనర్ శ్రీరాములునాయుడు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, పెరికి బలిజ బీసీ కార్పొరేషన్ డైరెక్టర్ శ్రీనివాసరావు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

రేపటి నుంచి సీబీటీ పరీక్షలు

గరుగుబిల్లి: పాఠశాల విద్యార్థులకు ఈ నెల 8 నుంచి 10వ తేదీ వరకు క్లాస్‌రూం బేస్డ్ టెస్ట్(సీబీటీ) నిర్వహణకు మండల విద్యాశాఖ ఏర్పాట్లు చేస్తోంది. స్థానిక ఎమ్మార్సీలో తరగతుల వారీగా ప్రశ్నపత్రాలను విభజిస్తున్నారు. 1 నుంచి 5వ తరగతి విద్యార్థులకు 8న తెలుగు, 9వ ఇంగ్లిష్, ఈవీఎస్ పరీక్షలు నిర్వహించనున్నారు. 6 నుంచి 10వ తరగతి విద్యార్థులకు 8న తెలుగు, 9న హిందీ, సైన్స్, 10న ఇంగ్లిష్, సోషల్ పరీక్షలు నిర్వహిస్తారు. ప్రభుత్వ పాఠశాలలకు ప్రశ్నపత్రాలతో పాటు ఓఎంఆర్ సీట్లను ఇవ్వనున్నారు. ప్రైవేటు పాఠశాలకు ప్రశ్నపత్రాలను మాత్రమే అందించనున్నారు.

గిరిజన స్పందనకు 51 వినతులు

సీతంపేట: స్థానిక ఐటీడీఏ కార్యాలయంలో ప్రాజెక్టు అధికారి బి.నవ్య ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించిన గిరిజన స్పందనకు 51 వనతులు అందాయని అధికారులు తెలిపారు. సీసీ రహదారి నిర్మించాలని కోరుతూ కొండబొర్లంగికి చెందిన లావణ్య, వేతన బకాయిలు చెల్లించాలని కోరుతూ వైటీసీ ఇన్‌చార్జిలు, వరదగోడ మంజూరు చేయాలని కొత్తగూడకు చెందిన అంజయ్య అధికారులకు వినతులు అందజేశారు. టార్పాలిన్లు ఇప్పించాలని పనసగూడ గ్రామస్తులు, కంప్యూటర్ కాటా ఇప్పించాలని దొండమానుగూడకు చెందిన సింహాచలం, పింఛను మంజూరు చేయాలని కుంబికి చెందిన రామారావు, అంగన్‌వాడీ పోస్టు మంజూరు చేయాలని ఇలిసిపురానికి చెందిన పద్మ అధికారులను కోరారు. స్పందనలో గిరిజన సంక్షేమశాఖ డీడీ నగేష్, జీసీసీ డీఎం సంధ్యారాణి, ఏఎంఓ పి.కోటిబాబు, ఏటీడబ్ల్యూఓ మంగవేణి, సీడీపీఓ రంగలక్ష్మి, పీఏఓ హరిబాబు, స్పోర్ట్స్ ఇన్‌ఛార్జ్ జాకాబ్ దయానంద్ తదితరులు పాల్గొన్నారు.

ఎస్టీ కులధ్రువీకరణ పత్రాలు ఇవ్వండి



ఆర్‌డీఓతో మాట్లాడుతున్న యానాది తెగ ప్రజలు

బొబ్బిలి: తమకు ఎస్టీ కులధ్రువీకరణ పత్రాలు మంజూరు చేయాలని పట్టణంలోని ఇందిరమ్మ కాలనీ యానాది తెగ(నక్కల వాళ్లుగా పిలవబడుతున్న)కు చెందిన ప్రజలు కోరుతున్నారు. ఇదే విషయమై సోమవారం పట్టణంలో ఆర్‌డీఓ శేషశైలజను కలిసి వినతిపత్రం అందజేశారు. బొబ్బిలిలో 40 ఏళ్లుగా నివాసముంటున్న తమకు కులధ్రువీకరణ పత్రాలు ఇవ్వకపోవడంతో తమ పిల్లలు చదువుకు దూరమవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇదే జిల్లాలోని సీతానగరం, మక్కువ మండలాల్లో ఉంటున్న తమ తెగకు చెందిన వారికి ఎస్టీ కులధ్రువీకరణ పత్రాలు మంజూరు చేస్తున్నారని, తమకు కూడా ఎస్టీ కులధ్రువీకరణ పత్రాలు ఇవ్వాలని కోరారు.

అన్ని గ్రామాలకు తాగునీటి సరఫరా



లచ్చయ్యపేటలో ఓవర్‌హెడ్‌ట్యాంకు పనులు పరిశీలిస్తున్న డీఈ హనుమంతరావు

సీతానగరం: గ్రామాల్లో జరుగుతున్న మంచినీటి పథకాల పనులు వేగవంతం చేయాలని ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ హనుమంతరావు కాంట్రాక్టర్లను కోరారు. ఈ మేరకు సోమవారం మండలంలోని లచ్చయపేటలో 10 వేల లీటర్ల నీటి సామర్థ్యం, రూ.12 లక్షల నిధులతో నిర్మిస్తున్న ఓవర్ హెడ్‌ట్యాంక్ నిర్మాణాన్ని ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వచ్చే వేసవి నాటికి అన్ని గ్రామాల ప్రజలకు ఇంటింటి కుళాయి ద్వారా తాగునీరు పంపిణీ చేసేందుకు పనులు జరుగుతున్నాయని తెలియజేశారు. అనంతరం చినభోగిలి, కాశీపేట, పెదభోగిలి గ్రామాల్లో జరుగుతున్న పనులను పరిశీలించారు. ఏఈ పవన్‌కుమార్ మాట్లాడుతూ బగ్గందొరవలస గ్రామంలో ఇంటింటి కుళాయి పనులు పూర్తి కావచ్చాయని, ఎమ్మెల్యే అలజంగి జోగారావు ఇంటింటి కుళాయిలను ప్రారంభించనున్నారని తెలియజేశారు. తామరఖండి జగనన్న కాలనీలో తాగునీటి సమస్యను పరిష్కరించడానికి చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. కార్యక్రమంలో లచ్చయ్యపేట సర్పంచ్ సీహెచ్ కృష్ణ, ఇంజినీరింగ్ సహాయకులు పాల్గొన్నారు.

సకాలంలో వేతనాలు చెల్లించాలి



ఈఓపీఆర్డీ వర్మకు వివరిస్తున్న సీఐటీయూ నాయకులు

సీతానగరం: గ్రీన్ అంబాసిడర్లకు సకాలంలో వేతనాలు చెల్లించాలని సీఐటీయూ మండల కార్యదర్శి జి. వెంకటరమణ, గ్రీన్ అంబాసిడర్ల సంఘం అధ్యక్షుడు జె.గౌరి కోరారు. ఈ మేరకు సోమవారం పంచాయతీ విస్తరణాధికారి ఎస్ఎస్ వర్మకు వినతి అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామాలను స్వచ్ఛ హరిత గ్రామాలుగా తీర్చిదిద్దాలని పీఎం నరేంద్రమోడీ ప్రతిష్టాత్మకంగా తీసుకున్న స్వచ్ఛభారత్ కార్యక్రమాన్ని గ్రీన్ అంబాసిడర్లు అమలు చేస్తున్నారన్నారు. ఈ మేరకు హరిత రాయబార్లకు స్వచ్ఛభారత్ మిషన్ ద్వారా గతంలో వేతనాలను చెల్లించేవారన్నారు. ప్రస్తుతం వీరి వేతనాలను పంచాయతీల ద్వారా చెల్లించాలని ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసిందని, అయితే పంచాయతీలు సకాలంలో వేతనాలు చెల్లించకపోవడంతో వారి కుటుంబాలు రోడ్డున పడే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. అధికారులు స్పందించి హరిత రాయబార్లకు వేతనాలను వెంటనే మంజూరు చేయాలని కోరారు.

కిశోరీ బాలికల్లో రక్తహీనత నివారణకు కృషిచేయాలి

● డీఎంహెచ్ఓ జగన్నాథ రావు

పార్వతీపురంటౌన్: కిశోరీ బాలికలలో రక్తహీనత నివారణకు కృషిచేయాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ బి.జగన్నాథరావు సూచించారు. ఈ మేరకు సోమవారం జిల్లా ఆస్పత్రి సమావేశ మందిరంలో ఆశ నోడల్ అధికారులతో పలు కార్యక్రమాలపై సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పీహెచ్‌సీల వారీగా హెల్త్ ప్రోగ్రాంల ప్రగతి నివేదికలు పక్కాగా ఉండాలని స్పష్టం చేశారు. హైరిస్క్ గర్భిణులను గుర్తించడం, ఆరోగ్య తనిఖీల వివరాలు పూర్తిస్థాయిలో నమోదు చేయాలని చెప్పారు. ప్రసవ సమయానికి వారం రోజులు ముందుగానే సంబంధిత రిఫరల్ కేంద్రంలో గర్భిని అడ్మిట్ అయ్యేలా చూడాలని పేర్కొన్నారు. అందుకు అవసరమైన రవాణా ఏర్పాటు చేయడం, డెలివరీ అయ్యేంతవరకు పర్యవేక్షించడంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని చెప్పారు.

షెడ్యూల్ ప్రకారం టీకాలు వేయాలి

అలాగే నవజాత శిశువుల ఆరోగ్య పర్యవేక్షణ కోసం శిశువుల టీకా కార్యక్రమాన్ని షెడ్యూల్ ప్రకారం క్రమం తప్పకుండా నిర్వహించి ఆర్‌సీహెచ్ పోర్టల్‌లో నమోదు చేయాలని అన్నారు. ఫ్యామిలీ డాక్టర్ ప్రోగ్రాం ద్వారా కల్పించిన అన్ని వైద్యసేవలు ప్రజలకు పూర్తిస్థాయిలో అందించాలని చెప్పారు. యుక్త వయస్సు వివాహాలపై ప్రభావితం అయ్యే శారీరక, మానసిక, ఆరోగ్య సమస్యలపై క్షేత్రస్థాయిలో అవగాహన కల్పించాలని సూచించారు. కార్యక్రమంలో జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి డాక్టర్ టి. జగన్‌మోహన్‌రావు, ఎపిడిమియాలజిస్టు డాక్టర్ నవీన్‌కుమార్, డీపీఓ లీలారాణి తదితరులు పాల్గొన్నారు.

వాహనచోదకులు రోడ్డు నియమాలు పాటించాలి

● ఇన్‌చార్జ్ ఎస్సై పవన్‌కుమార్



వాహనాలను తనిఖీచేస్తున్న ఇన్‌చార్జి ఎస్సై పవన్

సీతానగరం: వాహనచోదకులు తప్పనిసరిగా రోడ్డు నియమాలను పాటించి వాహనాలను నడపాలని ఇన్‌చార్జి ఎస్సై ఎన్.పవన్ కుమార్ పిలుపునిచ్చారు. స్థానిక హనుమాన్ కూడలివద్ద సోమవారం వాహనాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ద్విచక్ర వాహనాన్ని నడిపేవారు తప్పనిసరిగా హెల్మెట్ ధరించి ప్రయాణించాలని, డ్రైవింగ్ లైసెన్స్ తదితర ధ్రువీకరణ పత్రాలు కలిగి ఉండాలన్నారు. అపరాధరుసుం బకాయిలు చెల్లించాలని కోరారు. మద్యం తాగి వాహనాలు నడిపితే కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. మండలంలో ఎక్కువగా స్టేట్ హైవే ఉండడంతో వాహనదారులు జాగ్రత్తగావెళ్లి ప్రమాదాలు జరగకుండా చూడాలని కోరారు. మైనర్లు వాహనాలు నడిపితే కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. మైనర్లయిన పిల్లలకు తల్లిదండ్రులు వాహనాలు ఇవ్వవద్దని సూచించారు. ఆటోడ్రైవర్లు పరిమిత ప్రయాణికులతో నడపాలని హితవుపలికారు. సీతానగరం వంతెనపై ట్రాఫిక్ నియంత్రణకు ఎస్పీ, ఉన్నతాధికారుల ఆదేశాలమేరకు సిబ్బందిని నియమించామని చెప్పారు. రాత్రి పూట గస్తీ కూడా ముమ్మరం చేస్తున్నట్లు తెలిపారు. ట్రాఫిక్ నిబంధనలు పాటించని వారిపై కేసులు నమోదు చేస్తామన్నారు.

సీఎం జగన్‌తోనే సంక్షేమ పాలన



ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ పథకాలు వివరిస్తున్న ఎమ్మెల్యే శంబంగి

బొబ్బిలి: సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితోనే రాష్ట్రంలో సంక్షేమ పాలన సాధ్యమని ఎమ్మెల్యే శంబంగి వెంకటచిన అప్పలనాయుడు అన్నారు. స్థానిక పట్టణంలోని ఐదో వార్డులో సోమవారం నిర్వహించిన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యేకు స్థానికులు ఘనస్వాగతం పలికారు. అనంతరం ఇంటింటికీ వెళ్లిన ఆయన మూడున్నరేళ్లుగా ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి, అమలు చేస్తున్న పథకాలను వివరించారు. ఏమైనా సమస్యలున్నా, అర్హులై ఉండి ఎవరికైనా పథకాలు అందపోయినా వెంటనే తెలియజేయాలని తెలిపారు. ఈ క్రమంలో పలువురు ఆయన దృష్టికి తీసుకువచ్చిన చిన్నచిన్న సమస్యలను పరిష్కరించాలని సంబంధిత అధికారులను ఎమ్మెల్యే ఆదేశించారు. రాష్ట్ర సమగ్రాభివృద్ధి, ప్రజాసంక్షేమం కోసం ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి అహర్నిశలు శ్రమిస్తున్నారని, గత ఎన్నికల్లో ఆయన ఇచ్చిన హామీలతో పాటు మరెన్నో హామీలను నెరవేర్చారని పేర్కొన్నారు. కుల, మత, పార్టీలకు అతీతంగా అర్హతే ప్రామాణికంగా ప్రజలకు ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందించడం జరుగుతోందన్నారు. ఇప్పటివరకు అమలైన పథకాల్లో ఏ ఒక్క పథకంలోనూ అవినీతి జరిగిందన్న దాఖలాలు లేవన్నారు. ఇదే వైఎస్సార్ సీపీ ప్రభుత్వ పారదర్శక పాలనకు నిదర్శమన్నారు. గతంలో టీడీపీ హయాంలో ఏ ఒక్క పథకం కావాలన్నా, అభివృద్ధి పని జరగాలన్నా, మండల కేంద్రంలోని ప్రభుత్వ కార్యాలయాలు, అధికారులు, నేతల చుట్టూ కాళ్లరిగేలా తిరగాల్సిన దుస్థితి ఉండేదన్నారు. ఇప్పుడు ఆ పరిస్థితి లేదన్నారు. గ్రామ సచివాలయ, వలంటీర్ల వ్యవస్థలతో గ్రామ ప్రజల వద్దకే ప్రభుత్వ సేవలు వచ్చాయన్నారు. సమస్య పరిష్కారానికి సచివాలయంలో దరఖాస్తు చేసుకున్న కొన్నిరోజులకే సమస్య పరిష్కారమవుతోందన్నారు. వైఎస్సార్ సీపీ పాలనలో ప్రజలంతా సంతోషంగా ఉన్నారన్నారు. ప్రభుత్వంపై ప్రతిపక్షాలు, ఎల్లోమీడియా ఎన్ని విమర్శలు చేసినా ప్రజలు నమ్మరన్నారు. వచ్చే ఎన్నికల్లోనూ ఇదే ప్రభుత్వాన్ని ఆశీర్వదించి, మరోసారి సీఎం జగన్‌మోహన్‌రెడ్డిని ముఖ్యమంత్రిని, తనను ఎమ్మెల్యేను చేయాలని ప్రజలను ఎమ్మెల్యే కోరారు. కార్యక్రమంలో బొబ్బిలి మున్సిపల్ చైర్మన్ ఎస్.వెంకటమురళీకృష్ణారావు, పార్టీ మండల అధ్యక్షుడు ఎస్.వేణుగోపాలనాయుడు, మున్సిపల్ వైస్ చైర్మన్ సీహెచ్ మురళీకృష్ణ, బుడా చైర్మన్ ప్రతినిధి ఐ.గోపాలరావు, ఏఎంసీ వైస్ చైర్మన్ టి.పార్వతి తదితరులు పాల్గొన్నారు.

మే 7 నుంచి పైడితల్లి పండగ

వీరఘట్టం: వీరఘట్టం గ్రామదేవత పైడితల్లి అమ్మవారి పండగను మే నెల 7 నుంచి మూడ రోజుల పాటు నిర్వహించేందుకు గ్రామ పెద్దలు నిశ్చయించారు. ఏప్రిల్ 16న పండగ చాటింపు, 30న వనము నుంచి బోయిడు ఇంటికి అమ్మవారిని తీసుకురానున్నట్లు తెలిపారు. మే నెల 7,8,9వ తేదీల్లో గ్రామదేవత పండగ చేసేకునేందుకు యజ్ఞకర్త ఎస్.వి.ఎల్.ఎన్ శర్మ యాజీ ముహూర్తం ఖరారు చేశారు. అయితే ఇందుకు గ్రామంలో కొందరు సుముఖత వ్యక్తం చేయగా.. మరికొందరు వ్యతిరేకించారు.

8న ఉచిత వైద్యశిబిరం



ఎమ్మెల్యే జోగారావును కలిసిన అనిల్ నీరుకొండ జనరల్ మేనేజర్ గణేష్ తదితరులు

పార్వతీపురం టౌన్: ఈనెల 8న మండలంలోని వెంకంపేటలో ఉచిత వైద్యశిబిరాన్ని విశాఖపట్నం అనిల్ నీరుకొండ ఆస్పత్రి సౌజన్యంతో నిర్వహిస్తున్నట్లు ఆ ఆస్పత్రి జనరల్ మేనేజర్ గణేష్, అసిస్టెంట్ మేనేజర్ బాలరాజులు సోమవారం తెలిపారు. ఈ మేరకు ఎమ్మెల్యే అలజంగి జోగారావును కలిసి వైద్యశిబిరాన్ని ప్రారంభించాలని కోరినట్లు చెప్పారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ శిబిరంలో గర్భిణుల వైద్య నిపుణురాలు డాక్టర్ చైత్ర, కంటి వైద్య నిపుణురాలు డాక్టర్ లేశ్న, చిన్నపిల్లల వైద్యనిపుణురాలు డాక్టర్ బి.ప్రఫుల్ల, ఎముకల వైద్య నిపుణురాలు డాక్టర్ ప్రశాంతి, జనరల్ వైద్యురాలు డాక్టర్ బి.ఐశ్వర్యతో పాటు దంతవైద్యులు పాల్గొని తనిఖీలు నిర్వహించి ఉచితంగా మందులు అందజేస్తారని తెలియజేశారు.

శస్త్రచికిత్స అవసరమైన రోగులకు ఉచితంగా చేస్తామన్నారు. ఈ శిబిరాన్ని పీఎంపీ అసోసియేషన్ సభ్యుల సహకారంతో నిర్వహించనున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో పీఎంపీ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు నాగిరెడ్డి సింహాచలం, ఉపాధ్యక్షుడు వానపల్లి శంకరరావు తదితరులున్నారు.